ఈనాడు వైయస్ఆర్
ఆదివారం సెప్టెంబరు 29, 2024 5

గుంత... ప్రమాదాల చింత!



కడప నగర శివారులోని అలంఖాన్‌పల్లె నుంచి వైఎస్ఆర్ కూడలి మధ్య వంతెన గోతులమయంగా మారడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కడప నగర వాసులతోపాటు ఇతర రాష్ట్రాల వాహనచోదకులు ఈ మార్గం మీదుగా తిరుపతి, బెంగళూరు తదితర నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా రాత్రి వేళల్లో గుంతలను గుర్తించలేకపోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఈనాడు,కడప

దసరాకు 758 ప్రత్యేక బస్సులు

చిన్నచౌకు (కడప,), న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా కడప ఆర్టీసీ జోన్ (కడప, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నంద్యాల) పరిధిలో 758 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు శనివారం వెల్లడించారు. వైఎస్ఆర్ జిల్లా నుంచే 230 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బస్సులు అక్టోబరు 4 నుంచి 11వ తేదీ వరకు నడవనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచుతామని, సాధారణ టిక్కెట్ ఛార్జీలే వసూలు చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి 285, బెంగళూరు నుంచి 224, విజయవాడ నుంచి 76, చెన్నై నుంచి 40, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు 133 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పండగ అనంతరం అక్టోబరు 13వ తేదీ నుంచి తిరుగు ప్రయాణానికి 596 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడకు 73, హైదరాబాద్‌కు 215, బెంగళూరుకు 253, చెన్నైకి 23, ఇతర ప్రాంతాలకు 32 చొప్పున బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

మీ భవిష్యత్తుకు మీరే బాధ్యులు

జిల్లా సచివాలయం, సిద్దవటం, న్యూస్‌టుడే : విద్యార్థులు స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో పాల్గొని మీ భవిష్యత్తును మీరే నిర్మించుకునేందుకు సూచనలివ్వాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. శనివారం కడప కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్ 2047పై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ నెల 26, 27 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ వికాస పోటీలు, డిబేటింగ్‌పై పోటీ నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టరు బహుమతులు అందించి విద్యార్థులను అభినందించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిని వనిపెంట జ్యోతిరావుపులే పాఠశాలకు చెందిన యుసన, భాకరాపేట జడ్పీ పాఠశాల విద్యార్థి చిన్నరాయుడుకు ద్వితీయ, మైలవరం పాఠశాలకు చెందిన విష్ణు ఉజ్వల తృతీయ బహుమతి పొందారు. వక్తృత్వ పోటీల్లో కొత్త మాధవరం జడ్పీ పాఠశాలకు చెందిన సాయిశరణ్య, వేంపల్లె బాలికల పాఠశాల విద్యార్థి జాహ్నవి తొలి రెండు స్థానాల్లో నిలవగా, ఖాజీపేట తేజ పాఠశాలకు చెందిన సుదర్శిత తృతీయ బహుమతి పొందింది. డిబేటింగ్ విభాగంలో మైలవరం ఏపీఆర్ఎస్‌కు చెందిన మేఘన, షణ్ముఖ ప్రథమ బహుమతి పొందగా సీకేదిన్నె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దీపిక, అంగడివీధి జడ్పీ పాఠశాల విద్యార్థి భానుప్రకాశ్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. తృతీయ బహుమతిని పులివెందుల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బిందులత, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన గౌరీశంకర్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో డీఈవో అనురాధ, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టరు శివశంకర్, పక్కన డీఈవో అనురాధ

భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి ఆదేశాలు

జిల్లా సచివాలయం : జాతీయ రహదారుల అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టరు శివశంకర్ ఆదేశించారు. శనివారం కడప కలెక్టరేట్‌లో జాతీయ రహదారుల అభివృద్ధి, భూసేకరణపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ... రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు జాతీయ రహదారులు, రైల్వేలైన్ల నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో భూసేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఆయా రెవెన్యూ డివిజన్ల పరిధిలో భూ సేకరణ పనులు పెండింగ్ లేకుండా పునఃపరిశీలన చేసి నివేదిక అందించాలన్నారు. ఆర్డీవోలు వెంకటపతి, చంద్రమోహన్, ఎన్‌హెచ్ హైవే పీడీలు అశోక్‌కుమార్, గోపీకృష్ణ, సుదర్శన్‌కుమార్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు చర్యలు

కడప వ్యవసాయం: పత్తి కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రకాల పత్తికి వేర్వేరు ధరలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పొడుగు గింజ రకం పత్తి క్వింటాలుకు రూ.7,521, పొట్టి గింజ రకం పత్తికి రూ.7,121తో కొనుగోలు చేస్తారన్నారు. సీసీఐ ద్వారా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ప్రభుత్వ సాయంతో కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో ప్రొద్దుటూరులో కొనుగోలు కేంద్రాన్ని గుర్తించారన్నారు. రైతులు పత్తిని బాగా ఆరబెట్టుకుని తీసుకెళ్లాలన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌ను తీసుకుని సమీప రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కొనుగోలు చేసే తేదీని ప్రకటించిన అనంతరం రైతులు అక్కడికి తీసుకెళ్లాలని కోరారు.

ఆ పనులు ఆపేయండి

- ☛ 25 శాతం లోపుంటే రద్దు
- ☛ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి, సాగునీటి పనులు 25 శాతం లోపే ప్రగతి ఉంటే వెంటనే ఆపేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుత్తేదారులతో నిర్దేశిత ఒప్పందం జరిగిన అనంతరం భౌతికంగా పాతిక శాతం లోపే చేసిన వాటిని తక్షణమే గుర్తించి నివేదించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇటు వైఎస్ఆర్, అటు అన్నమయ్య జిల్లాల పరిధిలో నీటి పారుదల, పంచాయతీరాజ్, రహదారులు, భవనాలు, ప్రజారోగ్య, గ్రామీణ తాగునీటి సరఫరా, ఇతర శాఖల్లో ఇంకా మొదలు పెట్టకపోయినా వాటి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికే శ్రీకారం చుట్టి 25 శాతం లోపే పురోగతి ఉన్న పనుల వివరాలను క్షేత్రస్థాయి నుంచి తెప్పిస్తున్నారు. నీటిపారుదలశాఖలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనుమతి ఇచ్చినప్పటికీ కొంతమంది గుత్తేదారులు ముందుకురాలేదు. టెండర్లలో పాల్గొని పనులు దక్కించుకున్న అనంతరం నిదానంగా చేపట్టి మధ్యలోనే నిలిపేశారు. ఇలాంటి వాటిని రద్దు చేయాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. కుందూ నుంచి తెలుగుగంగ పథకంలో నీటిని తరలించే ఎత్తిపోతల పథకం నిలిచిపోనుంది. గాలివీడు ఎత్తిపోతల పథకం పనులు సైతం వేగంగా ముందుకు కదలడం లేదు. సర్వరాయసాగర్, వామికొండ జలాశయాల పరిధిలో పనుల తీరు చూస్తే నత్తే నయమనిపిస్తోంది. అన్నమయ్య జలాశయం మట్టికట్ట పునరుద్ధరణ పడకేసింది. పులివెందుల నియోజకవర్గం పరిధిలో పీబీసీ, సీబీఆర్, జీకేఎల్ఐ పరిధిలోనూ సూక్ష్మనీటి సాగు పథకం పనుల తీరు చూస్తే మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. పైగా పరిపాలన అనుమతిచ్చినా తర్వాత టెండర్లు పిలిచినా పనులు చేయడానికి గుత్తేదారులు ఆసక్తిచూపలేదు. ఇలాంటి పనులను కూడా పక్కన పెట్టనున్నారు. పథకం, ప్యాకేజీ వారీగా అధికారుల పనుల సమాచారం సేకరిస్తున్నారు. తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని అనుసరించి చేపట్టాలనా, వద్దా అనేది నిర్ణయం తీసుకుంటామని నీటిపారుదలశాఖ సీఈ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

పట్టాలెక్కనున్న జాతీయ రహదారులు!



- ఎన్డీయే ప్రభుత్వ హయాంలో కలగనున్న మోక్షం
- కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిన రాష్ట్ర సర్కారు
- కేంద్ర మంత్రి గడ్కరీ నుంచి సానుకూల స్పందన

– ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన జాతీయ రహదారుల నిర్మాణ పనులకు మోక్షం కలగనుంది. అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల అభివృద్ధికి ఊతమిచ్చేవిధంగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అడుగులేస్తున్నాయి. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి.. కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందజేశారు. అత్యధిక ట్రాఫిక్ ఉన్న రాష్ట్ర మార్గాలను జాతీయ రహదారులుగా మార్చాలని కోరారు. దీనికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు తయారు చేసినప్పటికీ ప్రత్యేక దృష్టిసారించకపోవడంతో పెండింగ్‌లో పడిపోయాయి.

రేణిగుంట నుంచి కడప వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు గతంలోనే కేంద్రం ఆమోద ముద్ర వేసింది. సోలాపూర్- చెన్నై ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా కడప- రేణిగుంట మధ్య ఉన్న జాతీయ రహదారి 716ను రూ.1,500 కోట్లతో పూర్తి చేసేందుకు టెండర్లు పూర్తయ్యాయి. అటవీశాఖ అనుమతులు రాగానే త్వరలో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. నాలుగు వరుసల రహదారికి అనుసంధానంగా సిద్దవటం మండలం భాకరాపేట నుంచి బద్వేలు, పోరుమామిళ్ల మీదుగా ప్రకాశం జిల్లా బేస్తవారిపేట వరకు జాతీయ రహదారి నిర్మాణానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తంగా 161 కిలోమీటర్ల పొడవు గల జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం రహదారి రాకపోకలకు అనువుగా లేదు.

లాజిస్టిక్ హబ్‌లకు అవకాశం

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి రాయచోటి మీదుగా రాజంపేట, చిట్వేలి, రాపూరు, గూడూరు మీదుగా కృష్ణపట్నం రేవును అనుసంధానిస్తూ 296 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం జరగనుంది. ఈ రహదారితో పాటు కడప- రేణిగుంట మార్గం కలయికతో అటు బెంగళూరు, ఇటు చెన్నై, మరోవైపు కృష్ణపట్నం పోర్టు అనుసంధానం జరుగుతుంది. ప్రధాన నగరాలకు సరకు రవాణా కేంద్రాల అవసరం పెరుగుతుంది. ఈ మార్గం సైతం వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల అభివృద్ధికి దోహదపడనుంది. జాతీయ రహదారుల వెంట భూముల ధరల పెరుగుదలతోపాటు ఆయా నియోజకవర్గాల్లో పంట ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. ఉద్యాన పంటల విస్తీర్ణం పెరిగేందుకు అవకాశాలు మెండుగా ఉండనున్నాయి. కొప్పర్తి పారిశ్రామికవాడకు అనుసంధానంతోపాటు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీల స్థాపనకు అవకాశాలు పెరగనున్నాయి. ఇలా కదిరి- కృష్ణపట్నం రేవు, రేణిగుంట- కడప, భాకరాపేట- బేస్తవారిపేట.. మూడు జాతీయ రహదారులు అనుసంధానంతో అభివృద్ధి ఊపందుకోనుంది. మరోవైపు బెంగళూరు- విజయవాడ జాతీయ రహదారి వైఎస్ఆర్ జిల్లా మీదుగా వెళ్లనుంది. ఈ మేరకు పనులు సైతం జరుగుతున్నాయి. ◆ అన్నమయ్య జిల్లాలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)ల నిర్మాణానికి రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెడ్డిపల్లె- పుల్లంపేట స్టేషన్, కోడూరు- అనంతరాజుపేట, అనంతరాజుపేట యార్డు సమీపంలో మరొకటి నిర్మాణం జరగనుంది. రైల్వేలెవల్ క్రాసింగ్‌ల వద్ద వంతెనల నిర్మాణానికి ఆమోదముద్ర వేయడంతో ప్రజల రాకపోకలు సులభతరం కానున్నాయి.

నేటి నుంచి మంత్రి సత్యకుమార్ పర్యటన



జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పర్యటించనున్నట్లు జిల్లా కేంద్రానికి అధికారిక సమాచారం అందింది. ఆదివారం ఆయన ధర్మవరం నుంచి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రొద్దుటూరు పట్టణానికి చేరుకుంటారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి అక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రొద్దుటూరు ఆసుపత్రిని పరిశీలిస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో కడప నగరానికి చేరుకుంటారు. 11 గంటలకు కడప ప్రభుత్వ దంత వైద్యకళాశాలకు చేరుకుని మినీ ఆడిటోరియం, కేంద్ర పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి చేరుకుని క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించి సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేయనున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. స్థానికంగా కడపలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొని రోడ్డుమార్గంలో విజయవాడకు బయలుదేరివెళతారు.

3 నుంచి ఏపీటెట్ పరీక్ష

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు (ఏపీటెట్) కంప్యూటర్ బేస్డ్ టెస్టును ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు డీఈవో అనూరాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు వారి హాల్‌టికెట్లను https://aptet.apcfss.inలో పొందాలని తెలిపారు. అభ్యర్థులు వారికి సంబంధించిన పరీక్ష తేదీ, కేంద్రాన్ని సరిచూసుకుని నిర్ణీత సమయం కన్నా అరగంట ముందే కేంద్రాలకు హాజరు కావాలన్నారు. కడప శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, సైన్స్, అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం, శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరు శ్రీ రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చైతన్యభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సందేహాలు, పరీక్ష కేంద్రాల సంబంధిత వివరాలకు 94415 57508, 91333 56786, 98660 41341 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులపై చిన్నచూపు!

పాఠశాలల సంఖ్య	మొత్తం విద్యార్థులు	పూర్తయిన కంటి పరీక్షలు	అద్దాల అవసరం	పరీక్షలు పూర్తయిన పాఠశాలలు
1,963	1,57,994	21,060	1,625	101

న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

నేటి విద్యార్థులే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తును శాసించే రేపటి పౌరుల్లో కంటి చూపు మందగిస్తోంది. అన్ని అవయవాల కన్నా కళ్లు ప్రధానమైనవి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 21,060 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, 1,625 మందికి అద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. బాలలు ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా చరవాణికి అతుక్కుపోవడంతో అనేక కంటి జబ్బులకు గురవుతున్నారు. సరైన పోషకాహారం తీసుకోవడం లేదు. ఫలితంగా కళ్లపై తీవ్ర ప్రభావం పడుతోంది.

◆ స్కూల్ ఆఫ్ హెల్త్ ఐ స్క్రీనింగ్' పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు ఒకటి నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆప్తమాలజిస్టులు బృందాలుగా ఏర్పడి ప్రాథమిక పరీక్షలు చేస్తున్నారు. అక్టోబరు వరకు కార్యక్రమం కొనసాగనుంది.

దృష్టి దోషాల నివారణలో చిత్తశుద్ధి కరవు



ప్రొద్దుటూరులో పరీక్షలు నిర్వహిస్తున్న నేత్ర వైద్య నిపుణులు

◆ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కనీసం 17 మంది అవసరం కాగా 12 మంది ఉన్నారు. ప్రస్తుతం రోజుకు 600 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరులలో వరుస సెలవులు రావడం, విద్యార్థులకు పరీక్షలు జరగడంతో ప్రాథమిక పరీక్షలు చేయడం సమస్యగా మారింది. ◆ వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 2023-2024 విద్యాసంవత్సరంలో 423 పాఠశాలల్లో 80,027 మంది విద్యార్థుల్లో 72,715 మంది విద్యార్థులను పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. 4,280 మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. 52 పాఠశాలల విద్యార్థులకు గతేడాది పరీక్షలు చేయలేదు.

◆ గతేడాది పరీక్షలు చేసినా విద్యార్థులకు కంటి అద్దాలు రాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో నేత్ర పరీక్షలు సక్రమంగా నిర్వహించడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

గడువు పెంచితే మంచిది

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అక్టోబరు వరకు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తాం. ప్రభుత్వం గడువు పెంచితే మరికొందరి విద్యార్థులకు పరీక్షలు చేస్తాం. ఏడాదికి 3,742 మందికి కంటి అద్దాలివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. **- డాక్టర్ సునీత, సమన్వయకర్త, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైఎస్ఆర్**

నేడు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లులను ఆదివారం చెల్లించవచ్చునని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో అన్ని విద్యుత్తు బిల్లు వసూలు కేంద్రాలు పని చేస్తాయని, వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంజన్నకు పూజలు



పూజలందుకుంటున్న గండి అంజన్న

వేంపల్లె, చక్రాయపేట, న్యూస్‌టుడే : ప్రముఖ పుణ్యక్షేత్రం గండి అంజన్నక్షేత్రం భక్తులతో నిండిపోయింది. శనివారం పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు కేసరిస్వామి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు పోలీసులు అన్నదానం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రామాపురం హెడ్‌కానిస్టేబుల్ గిరిబాబు, కడప ఎస్పీ కార్యాలయ కానిస్టేబుల్ నాగమనోహర్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరిని ఆలయ సహాయ బాధ్య కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకులు అభినందించారు.

ఎస్పీడీసీఎల్‌లో విభజన కసరత్తు

వచ్చే నెల నుంచి నూతన విధానం అమలుకు నిర్ణయం

న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ పర్యవేక్షణలోని ఉమ్మడి కడప జిల్లా విభజన ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. కడప సర్కిల్ కింద ఉన్న రాయచోటి, రాజంపేట డివిజన్లను అన్నమయ్య జిల్లా పరిధిలోకి చేర్చాలని ఉన్నత స్థాయి నుంచి అనుమతిచ్చారు. రాయచోటిలో సర్కిల్ (ఎస్ఈ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. రాజంపేట డివిజన్ కింద ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప డివిజన్ పరిధిలోకి చేర్చనున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో గతంలో ఆరు డివిజన్లు ఉండేవి. రాజంపేట, రాయచోటి అన్నమయ్య జిల్లాలోకి వెళ్లడంతో వైఎస్ఆర్ జిల్లాలలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్లు మాత్రమే ఉండనున్నాయి.

◆ అన్నమయ్య జిల్లా పీలేరు డివిజన్‌లో గతంలో 8 మండలాలుండేవి. ఇకపై ఎర్రవారిపాళెం, చిన్నవట్టిక్కల్ మండలాలను తిరుపతి సర్కిల్‌లోకి చేర్చనున్నారు. పీలేరు డివిజన్ నుంచి అన్నమయ్య జిల్లాలోకి ఆరు మండలాలే వస్తాయి. ◆ రాయచోటిలో ఏర్పాటు చేయనున్న కొత్త సర్కిల్‌లోకి రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు డివిజన్లు రానున్నాయి.◆ వైఎస్ఆర్ జిల్లాలో ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు కలిపి 58 మంది, రాయచోటిలో ఏర్పాటు కానున్న నూతన కార్యాలయం పరిధిలో 55 మంది పనిచేసేవిధంగా అనుమతిచ్చారు.◆ వైఎస్ఆర్ జిల్లాలో గృహ, వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ, హెచ్‌టీ కనెక్షన్లు 9.41 లక్షలుండగా, అన్నమయ్య జిల్లాలో 8.75 లక్షలు సర్వీసులుంటాయని అంచనా వేశారు. ◆ ఉమ్మడి జిల్లా సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బందిని సర్దు బాటు చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న యంత్రాంగం నుంచి బదలాయింపు, సర్దుబాట్లకు అభ్యర్థనలు స్వీకరించాలని చర్చిస్తున్నారు. మార్గదర్శకాల జారీపై కసరత్తు జరుగుతోంది.



కడప ఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే...: - రమణ, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్, కడప సర్కిల్

ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త సర్కిల్ ఏర్పాటు, డివిజన్ల పునర్విభజన చేయాలని నిర్ణయించాం. ఉమ్మడి కడప సర్కిల్ పరిధిలోని రాజంపేట, రాయచోటి డివిజన్లు ఇక అన్నమయ్య కొత్త ఎస్ఈ కార్యాలయం పరిధిలోకి వెళ్లనున్నాయి. ఈ మేరకు ఇటీవల ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఇప్పటికే విభజన ప్రక్రియపై కసరత్తు మొదలైంది. వచ్చే నెల నుంచి నూతన పాలన అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, పురపాలిక పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్ల ఖాళీలను భార్తీ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించి వాటిని ద్వారా భర్తీ చేయాలన్నారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు మండల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సమస్యలపై చర్చించారు.

జాతీయ రహదారిపై వెలిసిన షెడ్లు!

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో నూతనంగా నాలుగు వరుసల విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ రహదారిలోని కొందరి స్థలాలకు ఎదురుగా అక్రమంగా దుకాణదారులు షెడ్లు నిర్మించుకున్నారని వారు ఆరోపిస్తున్నారు. షెడ్లు తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని వాపోతున్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అక్రమంగా షెడ్లు వేసిన వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



పెద్దముడియం, ఖాజీపేట, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కింద పడి ఇంజేటి కిరణ్ (31) అనే యువకుడు మృతిచెందిన సంఘటన జీరెడ్డి కొత్తపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఆసీఫ్‌ఖాన్ వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీకి చెందిన ఇంజేటి కిరణ్ ఈనెల 27న జీరెడ్డి కొత్తపల్లె గ్రామంలోని జయమ్మకు చెందిన ఇంటిపై వెల్డింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి తలకు తీవ్ర గాయమైంది. ఇతను కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. ఖాజీపేటలోని సీతానగరంలో **కల్లూరి నాగేంద్రుడు** (46) గురువారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కేసీ కాలువ గట్టుపైన చరవాణి పడి ఉండటాన్ని గుర్తించి కుటుంబసభ్యులు కేసీ కాలువతో పాటు గ్రామ పరిసరాల్లో అంతా వెతికారు. శనివారం ఉదయం కేసీ ఉపకాలువలో శవం తేలడంతో పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని సీఐ మోహన్ తెలిపారు.

మైదుకూరు వాసి ఆత్మహత్య

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒంగోలు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. సుమారు 1.45 గంటల సమయంలో మైదుకూరు టీచర్స్ కాలనీకి చెందిన నాగులపాటి విద్యాసాగర్ (51), రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై అరుణకుమారి తెలిపారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

నాపరాళ్ల రాయల్టీ సమస్య పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా బాధ్యుడు భూపేశ్‌రెడ్డితో మాట్లాడుతున్న యజమానులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: నాపరాళ్ల రాయల్టీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు భూపేశ్‌రెడ్డిని పాలిష్ పరిశ్రమ, గనుల యజమానులు కోరారు. శనివారం దేవగుడిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద వారిని కలిసి సమస్యను విన్నవించారు. ప్రస్తుతం టన్నుకు రూ.280 చెల్లిస్తున్నామని వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటికి విరాళాల అందజేత

ముద్దనూరు, న్యూస్‌టుడే: స్థానిక టౌన్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటికి శనివారం ఉపాధ్యాయులు విరాళాలు అందించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉపాధ్యాయులు పాఠశాలకు విరాళంగా సౌండ్ సిస్టం, నీటి వసతికి రూ.లక్ష ఇచ్చారు. సీనియర్ ఉపాధ్యాయుడు మాబు మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి కొరకు విరాళం అందించిన ప్రతి ఉపాధ్యాయునికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: జడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూళ్లను డిప్యూటీ డీఈవో కృష్ణప్ప శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పరిసరాల పరిశుభ్రత, గ్రంథాలయాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈవో శివప్రసాద్ పాల్గొన్నారు.

కోట చూడాలంటే టిక్కెట్టు కొనాల్సిందే

సదుపాయాలూ కల్పించాలని సందర్శకుల సూచన

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో ప్రవేశ మార్గాన్ని ప్రత్యేకంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాటు చేశారు. కోటను సందర్శించేందుకు టిక్కెట్ ధరలను నిర్దేశించారు. ఈ విధానం శనివారం నుంచి అమలు చేస్తున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఒక ధర, శని, ఆదివారాల్లో మరొక ధర నిర్ణయించడంతో పర్యాటకులు విస్మయానికి గురవుతున్నారు.

● పోరుమామిళ్ల నుంచి రెండు స్కూల్ బస్సులు గండికోటకు చేరుకున్నాయి. వాగు ముందు ఏర్పాటు చేసిన ప్రవేశ మార్గం వద్ద బస్సులను ఆపారు. రెండు బస్సులకు రూ.150 చొప్పున రూ.300 చెల్లించాలన్నారు. విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.10 చొప్పున 70 మందికి చెల్లించాల్సిందేనని చెప్పడంతో తప్పని పరిస్థితుల్లో ఇవ్వాల్సి వచ్చింది.

● ఇద్దరు వ్యక్తులు ఒక ద్విచక్ర వాహనంలో గండికోటకు వెళ్లాలంటే వాహనానికి రూ.20, ఇద్దరు వ్యక్తులకు రూ.20 చొప్పున రూ.40 మొత్తం రూ.60 చెల్లించాలి. శని, ఆదివారాల్లో అయితే రూ.80 ఖర్చు చేయాల్సిందే.

● గండికోట చూసేందుకు టిక్కెట్లు అమల్లోకి రావడంతో 'అమ్మో గండికోటకా' అని సామాజిక మాధ్యమాలు, వాట్సప్ గ్రూపుల్లో టిక్కెట్ల ధరల వివరాలను పంచుకుంటున్నారు. 'ఎంట్రీ టిక్కెట్లు వసూలు చేస్తున్నారు దయచేసి గమనించండి' అంటూ సమాచారాన్ని పంపిస్తున్నారు. టిక్కెట్లు వసూలు చేస్తున్నారు కావున కోటలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పట్టణ ప్రజలు, పర్యాటకులు సూచిస్తున్నారు.

గండికోట అభివృద్ధికి నిధుల ఖర్చు

ప్రవేశ రుసుం నుంచి వచ్చే సొమ్మును గండికోట గ్రామాభివృద్ధి కోసం వెచ్చిస్తాం. గండికోట, కొట్టాలపల్లె గ్రామస్థులకు ఎలాంటి రుసుం లేదు. వారికి ఇబ్బంది ఉండదు. ఆధార్‌కార్డు చూపిస్తే ఉచితంగా వెళ్లొచ్చు. త్వరలోనే కోటలో పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పిస్తాం.

-సురేష్‌కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి, కడప

దేవాంగుల ఉనికికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వుట్టి నాగశయనం, సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: దేవాంగుల ఉనికి కోసమే దేవాంగ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని దేవాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వుట్టి నాగశయనం డిమాండ్ చేశారు. శనివారం దేవాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్లలో పద్మశాలీ కార్పొరేషన్‌లో తమ సామాజికవర్గానికి చెందిన ఒకరిని డైరెక్టర్‌గా నియమించడం హర్షణీయమన్నారు. దేవాంగ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకుండానే పద్మశాలీ కార్పొరేషన్‌లో తమ కార్పొరేషన్‌ను విలీనం చేశారనే అనుమానాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో పద్మశాలీల జనాభా తర్వాత ఎక్కువమంది ఉన్నది తమ సామాజికవర్గమేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వాన్ని తాము విమర్శించడం లేదని, తమకు కార్పొరేషన్ లేకుంటే ఉనికి కోల్పోతామనే ఆందోళనతో నిరసన తెలుపనున్నామన్నారు. నాయకులు రాగ నరసింహారావు, వుట్టి వీరయ్య, వెంకటసుబ్బరాయుడు, ప్రసాద్, రెడ్డిచంద్రశేఖర్ సుబ్రమణ్యం, వెంకటాచలపతి, రెడ్డిసుబ్బరాయుడు, కాటం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిందలు మోపడం తగదు

చాపాడు, న్యూస్‌టుడే: పద్ధతి ప్రకారమే తితిదే ఈవో డిక్లరేషన్‌లో సంతకం చేయాలన్నందుకు జగన్ ఎందుకు భయపడ్డారని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుమల పర్యటన రద్దు చేసుకుని ప్రభుత్వంపై నిందలు మోపడం సబబు కాదన్నారు. శ్రీవారిపై విశ్వాసంలేక హిందూయిజం అని దేశాన్ని, మతాన్ని తప్పుపడుతూ మాట్లాడడం సరికాదన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



బద్వేలులో భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, మహిళా కమిటీ సభ్యులు

భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ యువజన సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారిని ఎదుర్కొని ధైర్యసాహసాలు చూపారని నాయకులు కొనియాడారు.

-న్యూస్‌టుడే, క్లస్టరు బృందం

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



కలెక్టరు శివశంకర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని సన

మైదుకూరు, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర వ్యాసరచన పోటీలో మైదుకూరు మండలం వనిపెంట బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో ప్రథమ స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైంది. శనివారం కడపలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు ఎల్. శివశంకర్ విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మల పాల్గొన్నారు.

ఖాజీపేట: విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 జిల్లా స్థాయి పోటీలు శనివారం కడపలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ పోటీల్లో ప్రసంగ పోటీల విభాగంలో ఖాజీపేట సాయితేజ పాఠశాలకు చెందిన సుచరిత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచింది. పోటీలో రాణించిన సుచరితకు కలెక్టర్ శివశంకర్, డీఈవో అనురాధ ప్రశంసాపత్రం అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ఖాజీపేట: జిల్లా స్థాయిలో అండర్-19 విభాగంలో నిర్వహించిన త్రైక్వాండో, రెజ్లింగ్ పోటీల్లో బీరం కళాశాల విద్యార్థి వేముల మునిచైతన్య బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల కరెస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మునిచైతన్యను ఘనంగా అభినందించారు.

చాపాడు: మండలంలోని నరహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.సునీల్, కె.శ్రీదివ్య మాల్కంబ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం నరసింహశాస్త్రి తెలిపారు. శనివారం జరిగిన జిల్లా స్థాయి మాల్కంబ్ అండర్-17 విభాగంలో వీరు ప్రతిభ చూపారని ఫిజికల్ డైరెక్టరు ప్రశాంతి వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం

ముద్దనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో ముకుందరెడ్డి, ఈవోపీఆర్డీ వీరభద్రుడు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్తికాని లబ్ధిదారుడి ఇంటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఇల్లును పరిశీలించి. లేఅవుట్‌లోని ఇద్దరి లబ్ధిదారులకు వారి ఇళ్ల పూర్తికి సలహాలు ఇచ్చారు.

రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధ

కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే లడ్డూ పవిత్రతపై అసత్య ప్రచారం చేస్తోందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఆరోపించారు. వైకాపా పిలుపు మేరకు శనివారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాదురెడ్డి, ఎం.సుధీర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు దేవాలయాలను దర్శించుకున్నారు. స్వామివారు, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తిరుమల పవిత్రతను, లడ్డూ ప్రఖ్యాతిని దెబ్బ తీసేవిధంగా చంద్రబాబు ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. తెదేపా పాలనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను దారిమళ్లించేందుకు ఈ ఆరోపణలు చేశారన్నారు.

-న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ, అట్లూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

వరద బాధితులకు రూ.2.5 లక్షల విరాళం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రొద్దుటూరు తెదేపా నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ. 2.5 లక్షల విరాళం అందించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కును అందించారు. అనంతరం ప్రొద్దుటూరుకు సంబంధించిన పలు విషయాలు సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు.

శరన్నవరాత్రుల మహోత్సవ ఆహ్వానం


ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న సంఘం ప్రతినిధులు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి శరన్నవరాత్రుల మహోత్సవ ఆహ్వాన పత్రికలను శనివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బన్నూరు కృష్ణమూర్తి, నాయకులు పబ్బతి నాగేశ్వరరావు, సుంకు నాగేశ్వరరావు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్టోబరు 3వ తేదీ నుంచి 13 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ప్రత్యేకాలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

బి.కోడూరులో అపరిశుభ్రత పరిసరాలపై ఆగ్రహం


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వైజే.పద్మశ్రీ


వార్డెన్‌తో మాట్లాడుతున్న బద్వేలు జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి

బద్వేలు గ్రామీణ, బి.కోడూరు, న్యూస్‌టుడే: బద్వేలు పట్టణం, బి.కోడూరు మండలంలోని వసతి గృహాలను శనివారం న్యాయమూర్తులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బద్వేలు పట్టణంలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహంలో బాలల, సరుకులు, వంట గదులను బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వైజే.పద్మశ్రీ పరిశీలించారు. అన్ని గదులను సిబ్బంది ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు కూడా పరిశుభ్రత పాటించాలని సూచించారు. మంచి ఆహారాన్ని విద్యార్థులకు పెట్టాలని వార్డెన్ ఎస్.ప్రసాదుకు చెప్పారు. బి.కోడూరులోని ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని బద్వేలు జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి పరిశీలించారు. బియ్యం సంచుల పక్కన ఎలుకల మల మూత్రాలు విపరీతంగా ఉన్నాయని, అవే బియ్యాన్ని విద్యార్థులకు ఎలా వండిపెడుతున్నారని వార్డెన్ సుధాకర్‌ను ప్రశ్నించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం గుడ్డు, అరటిపండు, చిక్కీలు పెట్టలేదని విద్యార్థులు చెబుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని మందలించారు. సరైన భోజనం వడ్డించకుండా నాసిరకంగా వండిపెడుతున్నారని, వంట గదులు, బాత్‌రూమ్, మరుగుదొడ్లు విపరీత మైన వాసన వస్తున్నాయని ప్రశ్నించారు. సరైన ప్యానలేవు.. రిజిస్టర్‌లో 75 మంది విద్యార్థులుంటే ఇక్కడ 20 మంది కూడాలేరని గుర్తించి నిలదీశారు. వార్డెన్ మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థులు ఇంటికి వెళ్లి స్నానం చేసి భోజనానికి వస్తారని జడ్జితో చెప్పారు. మూడు నెలలుగా విద్యార్థుల హాజరు రిజిస్టరు నమోదు చేయకుండా ఎలా వదిలేస్తారని వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్లోని వసతి పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కేసీ.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపాలో ఇద్దరు కౌన్సిలర్ల చేరిక


కౌన్సిలర్ శివజ్యోతికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, పక్కన ముక్తియార్, నల్లబోతుల నాగరాజు, కుతుబుద్దీన్

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక కౌన్సిలర్లు గాజుల శివజ్యోతి (39వ వార్డు), చింపిరి అనిల్‌కుమార్ (39వ వార్డు) తెదేపాలో చేరారు. వారికి కార్మిక నాయకుడు చింతకుంట కుతుబుద్దీన్, తదితరులు చేరారు. వారందరికి ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి వేర్వేరుగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైకాపా ప్రభుత్వం ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని, ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని నమ్మి నాయకులు చేరుతున్నారన్నారు. ప్రజలకు సేవ చేయడానికి సహాయ సహకారాలందిస్తామని తెలిపారు. డిక్లరేషన్ ఇవ్వడం ఇష్టంలేకనే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వెళ్లలేదన్నారు. అనాదిగా పాటిస్తున్న సంప్రదాయాలను అందరూ గౌరవించాలన్నారు. అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తాననడం జగన్‌కు సరికాదని, దేవుడిపై నమ్మకం లేకనే డిక్లరేషన్ ఇవ్వడంలేదన్నారు. తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని ప్రయోగ నివేదికలు వెల్లడి చేస్తున్నా తప్పును సమర్థించుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మైలవరానికి ఆగిన కృష్ణాజలాలు


మైలవరం జలాశయానికి నిలిపిన కృష్ణాజలాలు

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయర్‌కు పంపుతున్న కృష్ణాజలాలను ప్రస్తుతం నిలుపుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు శనివారం తెలిపారు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట జలాశయానికి వచ్చే కృష్ణా జలాలను నిలిపివేసినట్లు తెలిపారు. గండికోట ఎత్తిపోతల పథకాల ద్వారా సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పైడిపాళేనికి 770 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 26.0 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ వెల్లడించారు.

పారిశ్రామిక పర్యటనతో సాంకేతిక పరిజ్ఞానం


టూర్ వెళ్తున్న పాఠశాల విద్యార్థులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఇండస్ట్రియల్ టూర్‌తో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందని ఎర్రగుంట్ల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల 9, 10 తరగతి విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు వెళ్లారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మాచునూరు పంచాయతీ పరిధి ఓ మైన్స్ (ఇనుపరాయి గని) గుంతలోని నీటిలో పడి శ్రీనివాసులురెడ్డి (36) మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వేంపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి పెండ్లిమర్రి మండలం బుడ్డాయపల్లెలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం గేదెలను మేతకు తోలుకెళ్లారు. గ్రామానికి సమీపంలోని మైన్స్ గుంత వద్దకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారు. మధ్యాహ్నం గేదెలు ఇంటికి రాగా శ్రీనివాసులురెడ్డి రాకపోవడంతో ఆయన భార్య వెతకగా నీటి గుంత వద్ద పాదరక్షలు కనిపించాయి. వెంటనే కుటుంబ సభ్యులకు తెలపగా వారు పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లను పిలిపించి నీటి గుంతలో గాలించగా మృతదేహం లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని సుంకులమ్మ ఆలయం వద్ద గంజాయి విక్రయిస్తున్న సోమేసుల నాగార్జునను అరెస్టు చేసినట్లు సీఐ రోశన్ పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఎస్సై ప్రతాప్‌రెడ్డి, సిబ్బందితో కలిసి అరెస్టు చేసి, ఇతడితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారని తెలిపారు. 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. నిందితుడిపై కడప చిన్నచౌక్, మైదుకూరులలో గంజాయి కేసులున్నాయని వెల్లడించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అటవీ భూముల సర్వే పక్కాగా చేపట్టాలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : అటవీ భూముల సర్వే పక్కాగా చేపట్టాలని డీఎఫ్‌వో వి.వి.సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. కడప డీఎఫ్‌వో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం 'ఎర్రచందనం పరిరక్షణ-అటవీ భూముల సర్వే' పై అటవీ అధికారులు, సర్వే అధికారులతో కలిసి కార్యశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో 2.97 లక్షల హెక్టార్లలో అటవీ భూములు ఉన్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అటవీ భూమిని రోడ్లు, ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యామ్నాయ భూమిని అటవీశాఖకు కేటాయిస్తారన్నారు. రెవెన్యూశాఖ అధికారుల సహకారంలో అటవీ సరిహద్దులు కచ్చితంగా ఉండేలా గుర్తించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా చూసుకోవడంతో పాటు... ఎర్రచందనం పరిరక్షణకు అటవీ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ... అటవీ భూముల సర్వేకు తమ శాఖ సహకారం ఉంటుందన్నారు. అటవీక్షేత్రాధికారులు ప్రసాద్, బాలసుబ్రమణ్యం, హేమాంజలి, కళావతి, ప్రణీత్, అశోక్‌కుమార్ యాదవ్, డీఆర్‌వోలు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి డిమాండు

వేంపల్లె: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏకోపాధ్యాయసంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ కోరారు. వేంపల్లెలో జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో శనివారం సంఘ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పనిచేసే పీజీటీలను రెగ్యులర్ పీజీటీలుగా గుర్తించి వారికి రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి డిమాండు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, సీపీఎస్ జిల్లా కన్వీనర్ సుదర్శన్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు పర్యాటక ఎక్స్‌లెన్స్ అవార్డు

వేంపల్లె, ఎన్జీవో కాలనీ (కడప): రాష్ట్ర పర్యాటక శాఖ 2024 ఏడాదికి ఉత్తమ పర్యాటక రచయితగా కడపకు చెందిన చరిత్ర అధ్యాపకుడు బాలగొండ గంగాధర్ పురస్కారం అందుకున్నారు. శుక్రవారం రాత్రి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక సభలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న గంగాధర్

ఉద్యోగాలివ్వాలని వేడుకోలు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఉపాధి కల్పన ద్వారా 1994లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు సంబంధించి ఎక్సైజ్ శాఖలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాలకు తాము ఎంపికైనా ఇప్పటి వరకు తమకు నియామకపత్రాలు జారీ చేయలేదని ఖాసన్న, నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 1994లో వెలువడిన నోటిఫికేషన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులకు దేహదారుఢ్య, రాత పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారి జాబితాను ప్రకటించారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనే ఉద్దేశంతో ముందుగానే జాబితాను వెల్లడించారు. ఇంతలో నోటిఫికేషన్ రావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిలిచిపోయిన ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేసి తమను ఆదుకోవాలని కోరారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్ద ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికల ప్రారంభం

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఆటలతోనే ఉత్తమ ఆరోగ్యం పొందొచ్చని అనంతపురం జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూ పరిధిలో రీజనల్ స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికల పోటీలు శనివారం నగర శివారులోని కేఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన జోజిరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చాటి యూనివర్సిటీ జట్టుకు ఎంపికవ్వాలని సూచించారు. కేఎస్ఆర్ సంస్థల ఎండీ చంద్రఓబుల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎంవీ.రత్నమ్మ, పీడీలు గంగాదేవి, వంశీనాయక్, టి.నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోజిరెడ్డి, పక్కన అధికారులు

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్పందన

కడప క్రీడలు, న్యూస్‌టుడే : కడప నగర శివారులోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలకు విశేష లభించింది. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ● షాట్‌పుట్ అండర్-17 బాలుర విభాగంలో జగదీష్, వినోద్, ఉదయ్‌సాయి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో శివమణి, సువశాణి, అమృత విజయం సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో ఇందిర, కమలప్రియ, ప్రార్థన, బాలుర విభాగంలో శ్రీను, ఉస్మాన్, గంగాధర్ వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు.



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జూనియర్ అసిస్టెంటు అదృశ్యంపై ఫిర్యాదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైనట్లు ఎస్సై అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎర్రముక్కపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి అన్నమయ్య జిల్లా రాజంపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 23న విధులకు వెళ్లి తిరిగి రాలేదు. అధికారుల వేధింపులు తాళలేక వెళ్లిపోతున్నట్లు లేఖలో రాసినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి భార్య బేబీ షామిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల అనంతరం ఆయన భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాల్‌డేటా ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ట్రిపుల్‌ఐటీలో ప్రాంగణ నియామకాలు

వేంపల్లె, న్యూస్‌టుడే : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పలువురు విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రాంగణ ఎంపికల్లో సీఎస్ఈ చదువుతున్న 11మంది విద్యార్థులు ఏడాదికి రూ.5.50 లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, పరిపాలనాధికారి పెనుగొండ రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌కైలాస్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్, ఏవో రవికుమార్, తదితరులు

రేబిస్ నివారణకు చర్యలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : కుక్కల్లో రేబిస్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం వీపీసీ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వీధి కుక్కలకు కూడా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పశువైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో నగరపాలక బాధ్య కమిషనర్ నందన్, వీపీసీ ఏడీలు సుబ్బరాయుడు, నేతాజీ, రాజశేఖర్, శ్రీధర్‌లింగారెడ్డి, నోడల్ అధికారి లీలాస్వర్ణ, పశువైద్యులు సంధ్యా, మాధవి, సిబ్బంది రాజశేఖర్, నాయక్, రమేష్ పాల్గొన్నారు.



కుక్కకు టీకా వేస్తున్న వైద్యాధికారులు

134 మద్యం దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు

కడప నేరవార్తలు: ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండుగా ఉన్న ఎక్సైజ్ శాఖను ఒక్కటిగా చేశారు. అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానున్న నేపథ్యంలో కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ఎక్సైజ్ ఠాణాల పరిధిలో 124 లేదా 134 మద్యం దుకాణాలు వచ్చే అవకాశముంది. నిబంధల ప్రకారం 124 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. గౌడ సామాజిక వర్గానికి పది శాతం దుకాణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో జిల్లాలో మరో పది దుకాణాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఆ సంఖ్య 134కు చేరుతుంది. జిల్లాకు ఒక డిప్యూటీ కమిషనర్, ఒక ఎన్‌ఫోర్సుమెంట్ అదనపు కమిషనర్, డిప్యూటీ సూపరింటెండెంట్ల నియామకాలు జరిగాయి. అధికారులు ఇప్పటికే అన్ని రకాల పత్రాలు సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి పాలసీ విధానం అమలు కాగానే జిల్లాలో దుకాణాలకు టెండర్ల ప్రక్రియ విడుదల చేస్తారు. అధికారులు ఈ మేరకు కసరత్తు ప్రారంభించారు.

టెండర్ల బరిలో బార్ల యజమానులు

జిల్లాలోని బార్ల యజమానులు కూడా మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు బారు యజమానులు అధికారులను కలుస్తున్నారు. గతంలో లాగా కాకుండా నగరంలో ఎక్కడైనా, ఎవరైనా దుకాణాల నిర్వహణకు టెండరు వేసుకోవచ్చు. బడి, గుడికి వంద మీటర్ల దూరంలో ఉండాలి. గతంలో కేటాయించిన పరిధిలోనే దుకాణాలు పెట్టుకోవాలనే నిబంధన ఉండేది. కానీ ఇప్పుడు ఆ నిబంధన లేదు. టెండరులో ఎవరికైతే దుకాణం లభిస్తుందో వారు తమకు ఇష్టమున్న చోట దుకాణం ఏర్పాటు చేసేకునే వీలుంది.

కేజీబీవీ బాలికలు... ఫుట్‌బాల్‌లో దిట్టలు

వల్లూరు, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వల్లూరు కస్తూర్బా గాంధీ విద్యార్థినులు ఫుట్‌బాల్‌లో రాణిస్తూ జిల్లాపోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడపలోని క్రీడాపాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఏడుగురు ఫుట్‌బాల్‌లో, ఒకరు హైజంప్‌లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం.

సోదరి ప్రేరణతో...



మా అక్క అఖిల ప్రోత్సాహంతో ఫుట్‌బాల్ ఆటలో రాణిస్తున్నాను. అక్క ప్రేరణ ఇస్తుంది. ఇంటి వద్ద అమ్మానాన్నలు ఆడుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. జాతీయస్థాయిలో సత్తా చాటేందుకు కృషి చేస్తున్నాను.
- అనూష

అమ్మనాన్నల సహకారంతో..



మాది చెన్నూరు మండలం కొండపేట. మా తల్లిదండ్రులు శ్రీలక్ష్మి గంగరాజుల సహకారంతో క్రీడల్లో రాణిస్తున్నాను. ఫుట్‌బాల్‌తో పాటు హాకీ కూడా ఇష్టం. పీఈటీ రీతు, విద్యార్థుల సహకారంతో ఫుట్‌బాల్ ఆటలో రాణిస్తున్నాను. రాష్ట్రస్థాయిలో సత్తాచాటి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తాను.
- ధరణి

హైజంప్‌తో రాణిస్తున్నా



మాది వల్లూరు మండలం తొల్లగంగన్నపల్లె. తల్లిదండ్రులు బేబీ, జయపాల్ చిన్నప్పటి నుంచి ప్రోత్సహించారు. హైజంప్‌తో పాటు కోకో ఆటంటే ఇష్టం. హైజంప్ ఆటలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటుతా.
- హాసిని

దాడుల నివారణకు ప్రత్యేక దృష్టి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో బడుగు బలహీన వర్గాలపై అఘాయిత్యాలు, దాడులు, దౌర్జన్యాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కడప కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు సత్వరమే న్యాయం అందించేలా చూడాలన్నారు. వారికి సంబంధించి భూ సమస్యలుంటే త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం, ఆర్డీవోలు వెంకటపతి, చంద్రమోహన్, వెంకటేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డా.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కడప క్రీడలు: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టును ప్రకటించారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరగనున్న పోటీల కోసం క్రీడాకారులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా, సంఘ సేవకుడు షేక్ చాంద్‌బాషా క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ గ్రామీణ బ్యాంకు దిశగా అడుగులు

కడప ఏడురోడ్లు : దేశంలోని 43 గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎన్ఆర్‌బీఐ)గా చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నామని ఆలిండియా రీజనల్ రూరల్ బ్యాంకు(ఏఐఆర్ఆర్‌బీ) ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ... గతంలో గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులకు జీతాలు తక్కువగా ఉండేవన్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ పోరాటాలతో వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులతో సమానంగా గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులకు జీతభత్యాలు వస్తున్నాయన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని సౌలభ్యాలు అందేలా చూస్తున్నామన్నారు. అంతకుముందు విజయదుర్గా దేవాలయం ఎదురుగా ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సొంత భవనాన్ని వెంకటేశ్వరరెడ్డి, ఏపీజీబీ ఛైర్మన్ సత్యప్రకాష్ సింగ్, జనరల్ మేనేజరు పి.ఆర్.పడ్గేట్‌వార్ ప్రారంభించారు. ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసన్న కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, ఏపీజీబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్బులు, పి.సురేష్, ఏఐఆర్ఆర్‌బీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భిక్షమయ్య, ఆంధ్ర-తెలంగాణ అధ్యక్షుడు రవికాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం : ఏపీజీబీ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా సుశీల్ వంశీ, అధ్యక్షుడిగా హనుమంతరెడ్డి, జనరల్ సెక్రటరీగా మహమ్మద్, కోశాధికారిగా రాహుల్‌తేజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా లోహిత్ మనోజ్, కడప రీజనల్ సెక్రటరీగా రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి, పక్కన అధికారులు

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న నగర కమిషనర్ నందన్, పక్కన పాఠశాల సిబ్బంది

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు గురువులను గౌరవించాలని కడప నగర కమిషనర్ వై.వి.నందన్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలోని నారాయణ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభివృద్ధి ప్రక్రియపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాజేశ్ చంద్రం, పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, సమన్వయకర్త సంపత్, ఏవో రెడ్డెయ్య, డీన్ సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

వసతి గృహాల పరిశీలన

చక్రాయపేట, న్యూస్‌టుడే : స్థానిక సాంఘిక సంక్షేమ, బీసీ బాలుర వసతి గృహాలను న్యాయమూర్తి వైజయంతిషా శనివారం తనిఖీ చేశారు. వంట గదులు, విద్యార్థుల గదులు, ఆవరణలో పరిసరాలను పరిశీలించారు. అనంతరం వసతి గృహ సంక్షేమ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు కేశవ, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్వో యంత్రాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి వైజయంతిషా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలకు వేంపల్లె తల్లిగర్భంపల్లె (?) జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన సరిబల ఆదిశేషారెడ్డి, అలవలపాడు విష్ణువర్ధన్, కంఠాని వెంకటశ్రీరాం ఇటీవల వేంపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ 3 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులు శివమునెమ్మ, పీడీలు శశిగల రాజశేఖర్, నర్రెడ్డి జయప్రద, ఫ్రాన్సిస్ రవికుమార్‌లు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాగార్జున పాఠశాల క్రీడాకారిణి

కడప క్రీడలు, న్యూస్‌టుడే : కడప నగర శివారులోని రాష్ట్ర క్రీడా పాఠశాలలో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో నాగార్జున పాఠశాలకు చెందిన క్రీడాకారిణి గీతికాంజలి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై సత్తాచాటింది.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఈ సందర్భంగా శనివారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పీడీ, శిక్షకులు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికవ్వాలని క్రీడాకారిణికి సూచించారు.

లస్కర్ల కొరత... రైతుల కలత

పులివెందుల (లింగాల) న్యూస్‌టుడే : కాలువల పర్యవేక్షణ, చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందించడంలో లస్కర్ల పాత్ర చాలా కీలకం. లింగాల కుడికాలువ, వైఎస్ పాశం, పీబీసీ ఆయకట్టుకు కృష్ణాజలాలు విడుదల చేసినా లస్కర్లను నియమించకపోవడంతో అధికారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పులివెందుల బ్రాంచి కాలువ (పీబీసీ) డివిజన్ పరిధిలో 2020 నుంచి పొరుగు సేవల పద్ధతిలో లస్కర్లను తాత్కాలిక పద్ధతిన నియమించి వారి సేవలను వినియోగించుకుంటున్నారు. పాడా గడువు ముగియడంతో ప్రస్తుతం వీరి సేవలకు స్వస్తి పలికారు. 30 ఏళ్ల కిందట పీబీసీ పరిధిలో 49, పీబీసీలో 17, జీకేఎల్‌ఐలో 17 మంది చొప్పున లస్కర్లు పనిచేసే వారు. వీరిలో చాలామంది ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం 9 మంది లస్కర్లు, నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. పీబీఆర్ నుంచి 68 కిమీ కాలువ పొడవునా 32 డిస్ట్రిబ్యూటర్లు, 4 నీటి నియంత్రణ గేట్లున్నాయి. ప్రధాన


కొత్తపల్లె క్రాస్ రెగ్యులేటర్ వద్ద పీబీసీ కాలువలో పరుగులు తీస్తున్న కృష్ణాజలాలు

కాలువ నుంచి ఉపకాలువకు నీరు విడుదల చేసేందుకు, పర్యవేక్షించేందుకు లస్కర్ల సేవలు అవసరం. వీరి కొరతతో ప్రధాన కాలువలు, ఉపకాలువలు, సమీప కుంటలు, చెరువులకు నీరు తరలించేందుకు రైతుల సేవలు వినియోగించుకుంటున్నారు. కాలువ చెంతన పొలాలున్న రైతులు కాల్వ గట్లను ధ్వంసం చేసి ఆక్రమించుకొని ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. దీంతో రైతుల మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్న 9 మంది లస్కర్లు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారు. లస్కర్ల కొరతతో కాలువ వెంబడి ముళ్లకంపలు పెరిగాయి. పీబీఆర్‌లో విడుదల చేసిన కృష్ణాజలాలు ఆయకట్టుకు చేరాలంటే లస్కర్లను నియమించాలని రైతులు కోరుతున్నారు.

గేట్ల నిర్వహణపై ఆందోళన

పీబీసీలో 1 డీఈ, ఇద్దరు జేఈలు అవసరం కాగా, గతేడాది బదిలీల్లో ఇప్పటికీ పోస్టింగులు ఇవ్వలేదు. అప్పటి నుంచి అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. గేట్ల నిర్వహణకు సాంకేతిక సిబ్బంది 10 మంది ఉండాలి. ఒక్కరూ లేకపోవడంతో గేట్ల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంది. రాత్రి వేళ, పగలు బృందాల వారీగా పీబీసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎగువన భారీ వర్షాలు కురిసి అల్లం కాల్వ నుంచి వరదనీరు పీబీసీకు పోటెత్తుతోంది. గేట్ల నిర్వహణకు సాంకేతిక సిబ్బంది లేక అనర్థం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. లస్కర్ల కొరత విషయమై పీబీసీ ఈఈ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా విషయాన్ని ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు రాగానే లస్కర్ల సేవలను వినియోగిస్తామని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండల పరిధిలో ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఇడుపులపాయ సీఐ నాగరాజు శనివారం తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మామిడి మొక్కల నరికివేతపై..

ఒంటిమిట్ట : మండలంలోని రాచగుడిపల్లెలో తన పొలంలో సాగు చేసిన మామిడి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారని వసంత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఊరితోపాటు, ఇబ్రహీంపేటకు చెందిన వ్యక్తులు వచ్చి మొక్కలను నరికివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కానిస్టేబుల్ భర్తపై ఫిర్యాదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప చిన్నచౌకు ఠాణా పరిధిలో కానిస్టేబుల్ భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కడప డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళ భర్త జయరామిరెడ్డి దంత వైద్యురాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. వైద్యురాలి ఫిర్యాదు మేరకు జయరామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఐ అర్జున్‌నాయక్ మృతికి సంతాపం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న అర్జున్ నాయక్ (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం అనంతపురం జిల్లా. ఈ మేరకు మృతదేహాన్ని అనంతపురానికి తరలించారు. ఆయన మృతికి జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ నివాళులర్పించారు.

కారు, లారీ ఢీ... పలువురికి స్వల్ప గాయాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని మంగంపేట శివారు ఇరుకురాళ్ల బోడు వద్ద జాతీయ రహదారిపై శనివారం కారు, లారీ ఢీకొన్నాయి. మైదుకూరు మండలం అన్నలూరు నుంచి నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు, కారు డ్రైవరు చంటి శ్రీకాళహస్తిలో స్వామివారి దర్శనం కోసం వెళ్తుండగా, చెన్నై నుంచి గుజరాత్‌కు వస్తున్న లారీ ఢీకొన్నాయి. లారీ చోదకుడు వాహన వేగాన్ని నియంత్రించలేకపోవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో అందరూ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు విచారణ చేపట్టారు.

సీఎంపై విమర్శలు దారుణం

పులివెందుల (వేంపల్లె) : సమాజంలోని అన్నిమతాలను వాడుకునేది వైఎస్ కుటుంబమేనని తెదేపా రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. పులివెందులలో శనివారం ఆయన మాట్లాడుతూ.. పులివెందులలో వెంకటేశ్వరస్వామి ఆలయం, చర్చిల నిర్వాహకులు వైఎస్ కుటుంబసభ్యులే అని విమర్శించారు. పులివెందుల మున్సిపల్ వైస్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఛైర్మన్‌గా, మదన్‌మోహన్‌రెడ్డి ఓ చర్చికి ట్రెజరర్‌గా పనిచేస్తున్నారన్నారు. వైఎస్ కుటుంబం ఏ మతానికి సంబంధం ఉందో చెప్పాలని డిమాండు చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై సీఎం చంద్రబాబు నాయుడిపై వైకాపా నేతల విమర్శలు దారుణమన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు నెల రోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ మంగళవారం ముగిసింది. బెంగళూరుకు చెందిన యునెక్ట్ ఉన్నతి శిక్షణ సంస్థ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు నెల రోజుల పాటు సాంకేతిక, కంప్యూటర్, లైఫ్ స్కిల్స్, ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు చివరి రోజు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సలీంబాషా, వైస్ ప్రిన్సిపల్ గురివిరెడ్డి, శిరీష, శిక్షకులు సౌజన్య, జేకేసీ వరప్రసాద్, విద్యార్థినులు పాల్గొన్నారు.


శిక్షణ ముగించుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపల్

ప్రతిభా పోటీల నిర్వహణ

వేముల : ప్రతిభా పోటీల్లో ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమని యురేనియం పరిశ్రమ డీజీఎం సుమన్‌సర్కార్ తెలిపారు. ఎం.తుమ్మలపల్లె యురేనియం పరిశ్రమలో హిందీ పక్వాడా-2024 ముగింపు సందర్భంగా శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హిందీలో సైన్సు, టెక్నాలజీ, ఆరోగ్యం, సాహిత్యానికి సంబంధించి పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అధికారులు కుమారస్వామి, శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

వేముల, న్యూస్‌టుడే : పెర్నపాడు ఉపకేంద్రంలోని చాగలేరు ఫీడర్‌కు మూడురోజులపాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ దినేష్‌కుమార్ తెలిపారు. కొత్తగా తీగలు లాగుతుండడంతో ఆదివారం నుంచి మంగళవారం వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో మండలపూజ కార్యక్రమాలను వేదపండితుల సమక్షంలో శనివారం నిర్వహించారు. నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ అనంతరం నిర్వహించిన మండలపూజలో అభిషేకాలు, హారతులు, అర్చనలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సమాజ సేవకు నడుం బిగించాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : విద్యార్థులు సమాజసేవకు నడుం బిగించాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ అర్థికాధికారి, ఎన్‌ఎస్‌ఎస్ నాలుగో విభాగం అధికారి కోటేశ్వరి అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త దీప్తి, అధికారులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ సిబ్బంది, అర్చకులు శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

సొంతింటితో మరింత గౌరవం

వల్లూరు, న్యూస్‌టుడే: సొంత ఇంటితో సమాజంలో మరింత గౌరవం పెరుగుతుందని, త్వరితగతిన నిర్మాణాలను వేగవంతం చేసి గృహ ప్రవేశాలు చేయాలని ఎంపీడీవో జయశ్రీ లబ్ధిదారులకు సూచించారు. మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని శనివారం దిగువపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ మారుతిప్రసాదు, ఏపీవో సుధారాణి, ఏపీఎం శైలజ, సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో మంచి మార్కులు

కమలాపురం : విద్యార్థులు పోటీతత్వంతో చదివి మంచి మార్కులు సాధించాలని తెదేపా ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఏకలవ్య ఫౌండేషన్ సహకారంతో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు సాయికుమార్, జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీదేవి, రాఘవ పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలోని ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడిపై పోలీసులు కేసునమోదు చేశారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ సదరు నిర్వాహకుడి ఛానల్‌లో యాంకర్‌గా పనిచేసి కొన్నాళ్ల కిందట మానేసింది. ఛానల్‌లో పనిచేయాలని నిర్వాహకుడు వేధిస్తున్నట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదుచేశారు. అయితే సదరు మహిళ తల్లి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారని దానిపై తాను హైకోర్టులో పిల్ దాఖలు చేశానని యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. దీనిపై రాజీకోసం జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి దగ్గర పంచాయతీ జరిగిందని రాజీకి తాను ఒప్పుకోకపోవడంతో తనపై అక్రమంగా కేసు బనాయించారని ఆరోపించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వేంపల్లె పట్టణ సీఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు.

కష్టపడి చదివితే సివిల్స్‌కు ఎంపిక

వేంపల్లె, న్యూస్‌టుడే : ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సమర్థవంతమైన ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో కష్టపడిచదివితే సివిల్స్‌కు ఎంపిక కావచ్చని పశ్చిమబెంగాల్ రాష్ట్ర కేడర్ విశ్రాంత డీజీపీ బీఎన్ రమేష్ అన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శనివారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో విష్ణు ఐఏఎస్ అకాడమీ మేనేజర్ యోగేష్, అకడమిక్ డీన్ దండూకర్ రమేష్‌కైలాస్, ఏవో రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో నిలవాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి అన్నారు. కడప నగర శివారులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.





ఉప ఖజానా కార్యాలయంలో కోర్టు విధులు


కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి

కమలాపురం : నూతనంగా నిర్మించిన ఉప ఖజానా కార్యాలయంలో అక్టోబర్ నెలలో కోర్టు విధులను నిర్వహించుకోవాలని జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి సూచించారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం పురాతనమైనది కావడంతో దాని స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా న్యాయమూర్తి కోర్టు భవనాన్ని పరిశీలించారు. అనంతరం కోర్టు ఎదుట ఉన్న ఉప ఖజానా కార్యాలయాన్ని పరిశీలించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు..

కావ్యజగత్తులో విశ్వనరుడు 'జాషువా'

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : సమాజానికి ఉపయోగపడే కవిత్వాన్ని అందించిన జాషువా కావ్యజగత్తులో విశ్వనరుడని డాక్టర్ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీ బ్రౌన్ కేంద్రంలో గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాషువా సుమారు 36 గ్రంథాలను, అనేక కవితా ఖండికలను వెలువరించారన్నారు.


గుర్రం జాషువా చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం డైరెక్టర్, సిబ్బంది





సమస్యల పరిష్కారానికి సీఎంకు వినతి

సిద్దవటం, న్యూస్‌టుడే : భాకరాపేట ఉద్దిమడుగు రిజర్వాయరుకు సంబంధించి పరిహారం మంజూరు కాని రైతులకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును తెదేపా రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులనాయుడు, తెదేపా మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ బాధ్యుడు దశరథరామనాయుడు కోరారు. తెదేపా రాష్ట్ర కార్యాలయంలో శనివారం వారిని కలిసి మండలంలోని సమస్యలపై వినతిపత్రం అందించారు.

కార్యకర్తలతో మంత్రి సమావేశం నేడు

లింగాల, న్యూస్‌టుడే : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ధర్మవరంలో ఉదయం బయలుదేరి లింగాల మండలం పార్నపల్లెకు 9.30 గంటలకు, లింగాల 10.30 గంటలకు చేరుకుంటారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రైతుల సమస్యలు తెలుసుకుంటారు. అక్కడి నుంచి పులివెందుల చేరుకుని భాజపా నాయకుడు శశిభూషణరెడ్డి ఇంట్లో నేతలతో సమావేశమవుతారని నియోజకవర్గ పరిశీలకులు మహేశ్వరరెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలకు సిద్ధం

మారుతీనగర్, న్యూస్‌టుడే : రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సమస్యలను గుర్తించి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, నగరపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళతామని రాకపా రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భావన టౌన్‌షిప్ అక్రమాలు, దళిత భూ సమస్యలపై ప్రత్యక్ష పోరాటం తదితర అంశాలపై చర్చించామన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రానున్న రోజుల్లో ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు సిద్ధిరామయ్య, మక్బూల్‌బాషా, నగర కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మీదేవి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం... యువతకు ఆదర్శం

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖులు పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతిని కడప, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాలలోని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయసాధనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. - న్యూస్‌టుడే బృందం


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు



కడపలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు, ఉపాధ్యాయులు